ఈనాడు
నిర్మల్
సోమవారం అక్టోబరు 14, 2024

చెరువును బట్టి చేప

మూడు రకాలుగా వదలడానికి ఆదేశాలు

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లాలోని జలాశయాలు, చెరువుల్లో చేప పిల్లల పంపిణీ ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. వాటి నాణ్యత, రకాలు, తదితర వాటిపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. చెరువులు, జలాశయాల్లో వదిలే చేప పిల్లల నాణ్యత చూసుకోవాల్సిన బాధ్యత మత్స్య పారిశ్రామిక సంఘాలదే. నాలుగైదు రోజుల్లో జిల్లాలోని చెరువును బట్టి చేప పిల్లలను వదలడానికి అధికారులు నిర్ణయించారు.

పర్యవేక్షణ తప్పనిసరి

సంవత్సరం పొడవుగా నీరుండే శాశ్వత చెరువుల్లో పిల్లలు వదిలేటప్పుడు తప్పనిసరిగా జిలా మత్స్యశాఖ అధికారి, ఎంపీడీవో, మండల వ్యవసాయాధికారి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, పది మంది కార్యవర్గ సభ్యులు విధిగా హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 6 నుంచి 8 నెలల పాటు నీరు నిల్వ ఉండే చెరువులు, కుంటల్లో వదిలేటప్పుడు జిల్లా మత్స్యశాఖ అధికారి/మత్స్య అభివృద్ధి అధికారి/సిబ్బంది, గ్రామ కార్యదర్శి, ఏఈవో, జిల్లా, గ్రామ మత్స్య సంఘం సభ్యులు ఉండాల్సి ఉంటుంది.

జిల్లా వివరాలు
- మత్స్య పారిశ్రామిక సంఘాలు : 220
- లబ్ధిదారులు : 13,500 మంది
- చెరువులు, కుంటలు : 648
- జలాశయాలు: 5 (స్వర్ణ, గడ్డెన్నవాగు, కడెం, రంగారావు పల్సీకర్, ఎస్సారెస్పీ)
- మొత్తం వదలనున్న చేప పిల్లలు: 2.37 కోట్లు

లెక్కించిన తర్వాతే వదలాలి

గతంలో ఉచిత చేప పిల్లల పంపిణీ విషయంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. నాణ్యత లేని, సైజు తక్కువగా ఉన్నవి వదలడంతో మత్స్యకారులు చాలా నష్టపోయారు. చెరువుల్లో ఎన్ని చేప పిల్లలు వదులుతున్నారో లెక్కల్లేకుండా పోయాయి. గుత్తేదారులు చెప్పినవే అధికారులు రికార్డుల్లో రాసుకుని బిల్లులు ఇచ్చేశారు. ఇప్పుడు అలా జరగకుండా ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ఏడాది లక్ష్యం చేపపిల్లల లక్ష్యం 4.75 కోట్లు ఉండగా.. ఇందులో సగానికి అంటే 2.37 కోట్లకు కుదించినా నిర్దేశిత ప్రమాణాల మేరకు ఇవ్వాలని నిర్ణయించారు. చేప పిల్ల నాణ్యత, సైజు మత్స్యకారులు చూసుకుని లెక్కించిన తర్వాతే చెరువులు, జలాశయాల్లో వదలాల్సి ఉంటుందని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. 6 నుంచి 8 నెలలపాటు నీరు నిల్వ ఉండే చెరువులు/కుంటల్లో 35-40 మి.మీ. సైజువి వదలనున్నారు. 35 శాతం కట్ల, మరో 35 శాతం రాహు, ఇంకో 30 శాతం బంగారు తీగ రకాల చేప పిల్లలను ఇవ్వాలని ఆదేశించారు. నీరు శాశ్వతంగా ఉండే చెరువులు, జలాశయాల్లో 80-100 మి.మీ. సైజు ఉన్న చేప పిల్లలు వదలనున్నారు. ఇందులో 40 శాతం బొచ్చ, 50 శాతం రాహు, మిగిలిన 10 శాతం మిరుగుల రకాలు ఇచ్చేలా మార్గదర్శకాలు జారీ చేశారు.


చెరువుల్లో వదిలే చేప పిల్లలు (పాతచిత్రం)

ఉత్పత్తి కేంద్రాలు అవసరం

జిల్లాలోని జలాశయాల కింద చేపల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం మత్స్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో కడెంలో మాత్రమే చేపల ఉత్పత్తి కేంద్రం ఉంది. గడ్డెన్నవాగు, స్వర్ణ జలాశయాల పరిధిలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటునకు అయిదేళ్ల కిందటే నివేదికలు పంపినా వాటి ఊసే లేదు.

నాలుగైదు రోజుల్లో వదులుతాం:

విజయ్‌కిరణ్‌కర్, జిల్లా మత్స్యశాఖ అధికారి

జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో నాలుగైదు రోజుల్లో చేప పిల్లలు వదలడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ సారి ఆలస్యమైనా నాణ్యత, సైజు సరిగా ఉన్న చేప పిల్లలను వదలాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. చేప పిల్లలను పూర్తిగా లెక్కించిన తర్వాతే చెరువులు, ప్రాజెక్టుల్లో వదులుతాం.

ఆయిల్‌పామ్ పరిశ్రమ నిర్మాణానికి భూమిపూజ

సోన్, న్యూస్‌టుడే: మండలంలోని పాక్‌పట్ల గ్రామ శివారులో నెలకొల్పనున్న ఆయిల్‌పామ్ పరిశ్రమ నిర్మాణానికి శనివారం ప్రీయూనిక్ ఇండియా కంపెనీ ప్రతినిధులు భూమిపూజ నిర్వహించారు. ఏడాది లోపే పరిశ్రమ నిర్మాణం పూర్తవుతుందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ పండించే రైతులతో త్వరలోనే సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

ముగిసిన అష్టభుజవేణుగోపాలస్వామి ఉత్సవాలు

లక్ష్మణచాందా: మండల కేంద్రంలోని అష్టభుజ వేణుగోపాలస్వామి శరన్నవరాత్రులు ఆదివారం ముగిశాయి. విజయదశమిని పురస్కరించుకుని నవరాత్రుల్లో నిత్యం రాత్రి సమయంలో రథోత్సవం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తమ ఇళ్ల ముందుకు రథంపై వచ్చిన స్వామివారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు. తీరొక్కవాహనంపై ఊరేగిన స్వామివారిని చూడటంతో పాటు, రథం ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


మంగళహారతులతో రథానికి స్వాగతం పలుకుతున్న మహిళలు


భైంసాలో దుర్గాదేవి శోభాయాత్రకు హాజరైన భక్తజనం


దుర్గాదేవి ప్రతిమను గడ్డెన్న వాగులో నిమజ్జనం చేస్తున్న భక్తులు

గంగమ్మ ఒడికి దుర్గమ్మ

నృత్యాలు, కోలాటాల మధ్య శోభాయాత్ర


భైంసాలో దుర్గామాతకు హారతి ఇస్తున్న ఎమ్మెల్యే పటేల్, ఎస్పీ జానకిషర్మిల, హిందూ ఉత్సవ సమితి నాయకులు

భైంసా, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగాయి. భైంసా పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో కొలువు దీరిన దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం భవానీచౌక్‌లోని దుర్గాభవాని మాత, పురాణాబజార్‌లోని సార్వజనిక్ దుర్గాదేవికి ఎమ్మెల్యే రామారావుపటేల్, ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాశ్ కుమార్ పూజలు నిర్వహించి శోభాయాత్ర ప్రారంభించారు. డీజే మోతల మధ్య యువత సందడి చేశారు. భక్తులు సంప్రదాయ నృత్యాలు చేశారు. మహిళల కోలాటాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గడ్డెన్న జలాశయం వద్ద నిమజ్జన ఘాట్‌లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

పటిష్ఠ నిఘా.. శోభాయాత్ర ప్రశాంతంగా జరగడానికి ఎస్పీ జానకి షర్మిల నేతృత్వంలో ఏఎస్పీ అవినాశ్‌కుమార్, ఓ డీఎస్పీ, నలుగురు సీఐలు, ఏడుగురు ఎస్సైలు, 250మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సున్నిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో పటిష్ఠ నిఘా పెట్టారు. సీఐ [illegible] బందోబస్తు పరిశీలించారు.


ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ల బాధ్యులు

క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: క్రీడాకారులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తమ లక్ష్య సాధన దిశగా ముందుకెళ్లాలని పలువురు అన్నారు. ఆదివారం నిర్మల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్- 14, 17 తైక్వాండో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. సుమారు వంద మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు మంచిర్యాలలో సోమవారం నుంచి జరగబోయే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని వెల్లడించారు. వివిధ సంఘాల బాధ్యులు తేజేందర్‌సింగ్ భాటియా, శ్రీకాంత్, రవీందర్‌గౌడ్, కె.భోజన్న, వన్నెల భూమన్న, లక్ష్మణ్, అమ్ముల భూషణ్, శిక్షకులు వంశీ, చిరంజీవి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో హక్కుల సాధన


కుంటాల: ఐక్య పోరాటాలతో హక్కుల సాధనకు కృషి చేద్దామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ముథోల్ తాలూకా అధ్యక్షుడు శంకర్ చంద్రే అన్నారు. చలో ఆదిలాబాద్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన నాయకులు ముందుగా మండలంలోని అర్లి(కె) ఎక్స్ రోడ్డుకు చేరుకున్నారు. అనంతరం కాన్వాయ్‌గా బయలుదేరి వెళ్లారు. సమితి తాలూకా ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్, ప్రధాన కార్యదర్శి విఠల్ కాంబ్లే, గౌరవాధ్యక్షుడు గంగాధర్ జాడే, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక లెక్కలు.. తొలగనున్న చిక్కులు

● సమగ్ర కుల గణనకు ప్రభుత్వం శ్రీకారం

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే

సమగ్ర సామాజిక వర్గ (కుల) గణనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంటింటికి తిరిగి అన్ని కుటుంబాలకు సంబంధించి కులంతో పాటు ఆర్థిక, సామాజిక స్థితిగతులు, విద్య, ఉద్యోగం, ఉపాధి తదితర పరిస్థితులపై ఒక అంచనాకు వచ్చేందుకు సర్కారు కసరత్తు ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కులాల వారిగా జనాభా గణనకు అవకాశం చిక్కింది. కులగణన చేపట్టడం ద్వారా ఆయా వర్గాలకు దక్కనున్న ప్రయోజనాలపై 'న్యూస్‌టుడే' కథనం.



◆ రాష్ట్ర జనాభాలో అనధికారిక లెక్కల ప్రకారం కులాల వారీగా జనాభా శాతం పోల్చి చూస్తే ఓసీలు 16 శాతం, బీసీలు 45, ఎస్సీలు 18, ఎస్టీలు 10, ముస్లింలు 11 శాతంగా ఉన్నట్లు అంచనా. ఓసీల్లో రెడ్డి 6 శాతం, కమ్మ 3 శాతం, బ్రాహ్మణ, వైశ్య, తెలగ బలిజ 2 శాతం చొప్పున ఉండగా వెలమ 0.5, ఇతర అగ్రవర్ణాలు మరో 0.5 శాతంగా ఉంది. ఇక ముస్లింలలో ఓసీలు 6 శాతం, బీసీలు 5 శాతంగా ఉన్నట్లు అంచనా.

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ, ఎస్టీల శాతం ఇలా...

ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో సగటు ఎస్సీ, ఎస్టీ జనాభాతో పోలిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వారి జనాభా అధికంగా ఉండటం గమనార్హం. రాష్ట్ర సగటులో ఎస్సీల జనాభా 15.5 శాతంగా ఉంది. ఆదిలాబాద్‌లో 14 శాతం, మంచిర్యాలలో అత్యధికంగా 24.7 శాతం నిర్మల్‌లో 15.2 శాతం, కుమురం భీం జిల్లాలో 15.8 కలిపి సగటున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనాభాలో 17.8 శాతం ఎస్సీలు ఉండటం గమనార్హం. ఎస్టీల జనాభా తీసుకుంటే రాష్ట్ర జనాభాలో 9.1 ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 31.7 శాతం, మంచిర్యాలలో 7.1, నిర్మల్‌లో 11.4, కుమురంభీం జిల్లాలో 25.9 కలిపి ఉమ్మడి జిల్లాలో సగటున 19.02 శాతం ఎస్టీలు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీలు కలిపి మొత్తం జనాభాలో 36.82 శాతం ఉండగా మిగిలిన 63 శాతంలో ఓసీ, బీసీలు ఉన్నారు.

పథకాల రూపకల్పనకు అవకాశం

విద్య, ఉద్యోగాల్లో ప్రస్తుతం బీసీలకు 29 శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం భావిస్తున్న బీసీ జనాభా కంటే కనీసం పది శాతం అధికంగా మొత్తం జనాభాలో 52 శాతం ఉంటుందని ఆయా వర్గాలు అంచనా వేస్తున్నారు. గతంతో పోలిస్తే ఓసీ సామాజిక వర్గం జనాభా గణనీయంగా తగ్గి తమ జనాభా పెరిగినట్లు బీసీలు అంచనా వేస్తున్నారు. తమకు జనాభా ప్రాతిపదికన ఫలాలు దక్కాలని పోరాటాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే ప్రభుత్వ పథకాలు, రాజకీయ అవకాశాలకు మాత్రం లెక్కలు ఉపయోగపడే అవకాశముంది.

గణాంకాల్లో వ్యత్యాసాలు

ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కలతో పాటు, ఇతర సందర్భాల్లో ప్రభుత్వాలు అవసరమైన గణాంకాలు తీసుకున్నా కుల ప్రాతిపదికన సమగ్రంగా జనాభా గణన చేపట్టలేదు. దీంతో కొన్ని సామాజిక వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ వర్గాల్లో కులం ఆధారిత జనాభా శాతం ప్రభుత్వ అంచనాలతో పోలిస్తే ఒకటి, రెండు శాతం అటు ఇటుగా ఉన్నప్పటికీ బీసీల జనాభా విషయంలో మాత్రం గణనీయమైన వ్యత్యాసాలు ఉంటాయని ఆ సామాజిక వర్గం భావిస్తోంది. వందకు పైగా ఉప కులాలు ఉన్న తమ జనాభా ఎక్కువగా ఉన్నా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తమకు అందాల్సిన ఫలాలు అందడం లేదని వారి వాదన. ఉన్నత న్యాయస్థానం కూడా బీసీ జనాభా తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర సగటు ఆధారంగా బీసీల జనాభా ప్రస్తుత అంచనా కంటే ఎక్కువగా ఉండే అవకాశముంది. జిల్లాల వారీగా సగటు చూస్తే జనాభా ఎంత ఉండే అవకాశం ఉంది గణన తర్వాతనే తేలే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వినియోగం లభ్యత ఎంత

● భూగర్భ జలాల వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు


భూగర్భజలాల వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలపై ఆరా తీస్తున్నారు. ఏటా జిల్లాల వారీగా నీటి అవసరాలు, వినియోగం, లభ్యత తదితర వాటిపై కేంద్ర భూగర్భ జల సంఘం, రాష్ట్ర భూగర్భజల శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహిస్తున్నాయి. గతంలో మాన్యువల్‌గా నమోదు చేసి లెక్కలు తీయాల్సి వచ్చేది. ఈ సీజన్‌లో గ్రౌండ్ వాటర్ రిసోర్స్ ఎస్టిమేషన్ సిస్టమ్(ఐఎన్ జీఆర్ఈఎస్) యాప్‌లో నమోదు చేస్తున్నారు. గ్రామాల వారీగా భూగర్భజలాల లెక్కలను సంబంధిత అధికారులు తీస్తున్నారు.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

ఉమ్మడి జిల్లా సాధారణ వర్షపాతం 1150 మి.మీ.లు కాగా సగటున 900 మి.మీ.లకు పైగా కురుస్తోంది. సాధారణ వర్షపాతానికి చేరువలో వర్షం కురిస్తే ఆరు మీటర్ల భూగర్భజలాలు పెరుగుతాయని అధికారులు అంటున్నారు. ఏటా వినియోగం పెరుగుతుండటంతో వనరులు తగ్గిపోయే అవకాశాలున్నాయి. జిల్లాలో ఎక్కువ మంది భూగర్భ జలాలపైనే ఆధారపడాల్సి వస్తుంది. మిషన్ భగీరథ రాకతో ఉపరితల జలాన్ని ఎక్కువశాతం సద్వినియోగం చేసుకుంటున్నారు.

జిల్లాల వారీగా 2023లో భూగర్భ జలాల వినియోగం ఇలా ఉంది (హెక్టా మీటర్లలో)
■ వర్షపాతం ■ నీటి లభ్యత ■ వినియోగం

	ఆదిలాబాద్	కుమురంభీం	మంచిర్యాల	నిర్మల్
వర్షపాతం	1164	1154	1045	1056
నీటి లభ్యత	55,241	59,754	86,868	63,935
వినియోగం	19,730	9,510	24,489	23,282

◆ జిల్లా జనాభా అవసరం మేరకు తాగు నీటిని అందించేందుకు వీలుగా నీటి వనరులు ఉన్నాయి. అయినా అనేక గ్రామాలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయి. గత ప్రభుత్వం ఉపరితల జలాలను వినియోగించుకునేందుకు జలాశయాల్లోని నీటిని తాగేందుకు వినియోగించుకునేందుకు మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. వర్షం నీటిని ఇంకించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. గత నివేదిక మేరకు మంచిర్యాల జిల్లాలో నీటి వినియోగం ఎక్కువగా ఉంది. ఆ తర్వాత నిర్మల్‌లో ఉంది. నీటిని ఇష్టానుసారంగా వినియోగించుకోవడం, వృథా నీటిని భూమిలో ఇంకించే ప్రయత్నాలు చేయకపోవడంతో భవిష్యత్తులో నీటి సమస్య ఎక్కువయ్యే అవకాశం ఉంటుందని సంబంధిత అధికారి పుల్లారావు తెలిపారు. నీటి లెక్కల మేరకు సమస్య ఉన్న మండలాల్లో నీటిని ఇంకించే పథకాలను ప్రవేశపెట్టే అవకాశముందని తెలిపారు.


రావణ ప్రతిమ దహనాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తజనం


మహాలక్ష్మి ఆలయంలో దర్శనం కోసం వరుసలో ఉన్న భక్తులు

భక్తజన సంద్రం.. మహాలక్ష్మి క్షేత్రం

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ శివారులో ఉన్న మహాలక్ష్మి ఆలయానికి విశేష చరిత్ర ఉంది. అమ్మవారు పట్టణానికి రక్షగా ఉంటారని ఇక్కడ జనం నమ్ముతారు. అందుకే కులాలకు అతీతంగా ఆలయాన్ని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. దేవాదాయశాఖ నిధులతో ప్రాచీన దేవాలయాన్ని కొద్దినెలల క్రితం పునరుద్ధరించారు. ఏటా దసరా పర్వదినాన పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజించడం ఆనవాయితీ. ఈ ఏడాది అదేరీతిలో ఆ ప్రాంతమంతా భక్తులతో సందడిగా మారింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా ఏర్పాట్లుచేశారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.


ఆయుధపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఎస్పీ జానకి షర్మిల

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో..

విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో, ఆలయ కమిటీ- ఆంజనేయ యువజన సంఘం సహకారంతో ఆలయ సమీపంలో శనివారం సాయంత్రం భారీ బహిరంగసభ నిర్వహించారు. వీహెచ్‌పీ ఇందూరు విభాగ్ ప్రచారక్ శివకుమార్ ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎస్పీ జానకి షర్మిల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శమి చెట్టు, ఆయుధపూజ చేశారు. రావణదహనం జరిపారు. దొండి శ్రీనివాస్, రాంరాజ్ ఆధ్వర్యంలో రూపొందించి ప్రదర్శించిన 'నిమ్మల చరిత్ర' లఘు చిత్రం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

జిల్లా కేంద్రంలో ఔషధ గిడ్డంగి

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో కేంద్ర ఔషధ గిడ్డంగి ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కేంద్రంలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉన్న ఔషధ నిల్వ కేంద్రం నుంచి జిల్లాలోని ఆసుపత్రులకు ఔషధాలు పంపిణీ చేసేవారు. ఒక్కోసారి వాహనం అందుబాటులో లేకుంటే నిర్మల్‌కు మందులు చేరవేయడంలో జాప్యం జరిగేది. జిల్లా కేంద్రం నుంచి ఫార్మసిస్టు ఆదిలాబాద్ వెళ్లి మందులు తీసుకరావాల్సి వచ్చేది. మందులు ఇక్కడికి చేరే వరకు ఎదురు చూసే పరిస్థితి ఉండేది. ఇక ఇక్కట్లు తొలగిపోయాయి. ఇక్కడ ఔషధ నిల్వ కేంద్రం ఏర్పాటుతో సౌకర్యంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు తెలంగాణ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో మందుల నిల్వ కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం నుంచి మందులు ఆయా ఆసుపత్రులకు సరఫరా చేయనున్నారు. ఈ మందుల నిల్వ కేంద్రాన్ని ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని కార్యానిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు అంజయ్య పర్యవేక్షణ చేస్తారు. నిల్వ కేంద్రానికి ఫార్మసిస్టు వేణుగోపాల్ బాధ్యుడుగా వ్యవహరించి, జిల్లాలోని ఆసుపత్రులకు వాహనం ద్వారా సరఫరా చేయనున్నారు.

నిర్మల్ నుంచి మందులు అందుకునే ఆసుపత్రులివే..	
జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి(జీజీహెచ్)	01
సామాజిక ఆరోగ్య కేంద్రాలు(సీహెచ్‌సీ)	03
ప్రాంతీయ ఆసుపత్రి(ఏహెచ్)	01
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ)	16
పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీ)	03



నిర్మల్ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా కేంద్ర ఔషధ గిడ్డంగి

వంద కిలోమీటర్లు ప్రయాణిస్తూ.. క్రికెట్ ఆడేస్తూ



ఈమె పేరు సుచరిత. చెన్నూరు పట్టణానికి దగ్గరలోని ఓ గ్రామం నుంచి తెల్లవారుజామునే తన క్రికెట్ కిట్‌తో మంచిర్యాలబాట పడుతుంది. జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో హెచ్‌సీఏ క్రికెట్ శిక్షణ కేంద్రానికి 6 గంటలకే చేరుకుంటుంది. దాదాపు తొమ్మిది గంటల వరకు ఇక్కడ సాధన చేస్తుంది. అబ్బాయిల బౌలింగ్‌లో బ్యాటింగ్ చేస్తూ వారికి సైతం బౌలింగ్ చేస్తుంది. రోజులో 5-6 గంటలు క్రికెట్ శిక్షణకు సమయం కేటాయిస్తుంది. డిగ్రీ పూర్తి చేసుకున్న సుచరిత రాష్ట్రస్థాయిలో పలు పోటీల్లో పాల్గొని మెరుగైన ప్రదర్శన ఇస్తోంది. జాతీయస్థాయిలో ఆడటమే లక్ష్యంగా కసరత్తు చేస్తోంది.

క్రికెట్‌పై ఆసక్తి.. మైదానం బాటపట్టి

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే:

పేరుపొందిన నగరాల్లో తప్పితే ఇప్పటికీ అమ్మాయిలకు ఆటలేందుకు అనేవారు ఇంకా లేకపోలేదు. అందులో క్రికెట్ అంటే ఆమడదూరం ఉంచుతారు. కొంత మంది అమ్మాయిలకు క్రికెట్‌పై ఆసక్తి ఉన్నా తల్లిదండ్రుల కోసం తమ ఇష్టాన్ని పక్కన పెట్టడమో, లేక ఇతర ఆటలపై మొగ్గు చూపడమో చేస్తున్నారు. కానీ కొందరు మాత్రం దీనిపై మక్కువ చూపిస్తున్నారు. అమ్మానాన్నలను ఒప్పించి మరీ శిక్షణకు సిద్ధమవుతున్నారు. చివరకు వారి ఆసక్తి చూసి నిత్యం కుటుంబ సభ్యులే మైదానానికి తీసుకొస్తున్నారు. వారి సాధనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. అమ్మాయిలు సైతం క్రమం తప్పకుండా మైదానంబాట పట్టి బ్యాట్, బంతితో ప్రతిభ కనబరుస్తున్నారు. శిక్షకుడి సూచనలు, మెలకువలతో మెరుగ్గా తయారవుతున్నారు.

మక్కువ పెంచుకుని సాధన



జైపూర్ మండలానికి చెందిన ఈమె పేరు సంజన. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఏడాది కిందటి వరకు క్రికెట్ అంటే తెలియదు. కానీ గత సంవత్సరం నుంచి ఈ ఆటపై ఆసక్తి పెంచుకుంది. తన తపన చూసి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సిరంగి గోపాల్ ప్రోత్సహించడం మొదలు పెట్టారు. శిక్షణ కోసం పాఠశాలలో చిన్నపాటి పిచ్ సిద్ధం చేయించారు. దీంతో అబ్బాయిలతోపాటు సంజన సైతం నిత్యం సాధన చేయడం ప్రారంభించింది. ఇటీవల మంచిర్యాలలోని హెచ్‌సీఏ శిక్షణ కేంద్రానికి వస్తూ మెలకువలను నేర్చుకుంటోంది. శిక్షకుడి సూచనలు శ్రద్ధగా వింటూ బౌలింగ్, బ్యాటింగ్ శైలిని మెరుగుపరుచుకుంటోంది.



అమ్మాయిలకు సూచనలు చేస్తున్న హెచ్‌సీఏ శిక్షణ కేంద్రం శిక్షకుడు ప్రదీప్

పదేళ్లు కూడా లేవు.. బ్యాట్ పట్టేసింది



మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సమన్వికి పదేళ్లు కూడా లేవు. బ్యాటింగ్, బౌలింగ్ చేస్తోంది. తన పట్టుదల, క్రమశిక్షణతో శిక్షణ కేంద్రంలోని సీనియర్ క్రీడాకారులతోపాటు శిక్షకుడిని సైతం ఆకట్టుకుంటోంది. ఇప్పటికే కరాటేలో అనేక పతకాలు సాధించగా క్రికెట్‌పై ఆసక్తితో నిత్యం మైదానానికి వచ్చి పరుగు పెడుతోంది. శిక్షకుడి సూచనలను పాటిస్తోంది. తండ్రి సహకారానికితోడు కావడంతో ఈ చిన్నారి క్రమం తప్పకుండా మైదానానికి వస్తోంది. మెరుగైన ఆటతీరుతో జాతీయ స్థాయికి చేరుతానంటోంది.

కష్టాలు అధిగమించి.. కొలువులు సాధించి

మామడ, న్యూస్‌టుడే:

జీవితం వడ్డించిన విస్తరిలా అన్నీ ఉన్నా కొంత మంది చిన్నపాటి అవరోధాలకే కుంగుబాటుకు గురవుతారు. అమ్మో తనవల్ల కావట్లేదని ప్రగతి సాధించే ప్రయత్నాలను వదులుకుంటారు. ఇంకొందరు ఏమీ లేకున్నా.. పరిస్థితులన్నీ ప్రతికూలంగా ఉన్నా భవిష్యత్తుకు బంగారు బాట వేసుకునేందుకు శక్తియుక్తులు కూడగట్టుకుంటారు. ఇదిగో ఈ యువకులకు ఒకప్పుడు కనుచూపుమేరంతా శూన్యంగానే ఉండేది. ఆ చీకటిని పారదోలి జీవితంలో కొత్త వెలుగులు తెచ్చుకునేందుకు వారు పడిన కష్టం స్ఫూర్తిదాయకం.

అసలే పేదరికం.. ఆపై అమ్మానాన్నలు దూరం



తమ్ముడు సురేష్‌తో అన్న సుమన్‌రెడ్డి

మామడ మండలం న్యూసాంగ్వికి చెందిన గంగారెడ్డి-భూమవ్వ దంపతులకు సుమన్‌రెడ్డి, సురేష్ రెడ్డి ఇద్దరు సంతానం. కొద్దిపాటి వ్యవసాయం ఉన్నా అంతగా గిట్టుబాటయ్యేది కాదు. నిత్యం కష్టాలమయంగానే ఉండేది. ఈ పరిస్థితుల్లో ఉన్నట్టుండి తండ్రి గంగారెడ్డి మరణించారు. అప్పుడు సుమన్ ఇంటర్ చదువుతున్నారు. సంపాదనకు ఏకైక ఆధారమైన నాన్న కాలం చేయడంతో ఎటూ పాలుపోలేదు. ఇదే తరుణంలో అమ్మ భూమవ్వ మృతి చెందారు.

తమ్ముడే తండ్రయ్యాడు..

అంతా శూన్యంలా మారినా ఆ సోదరులు తడబడలేదు. అన్నా.. నువ్వు బాగా చదువుకో నేను కష్టపడి డబ్బు సంపాదిస్తానంటూ తమ్ముడు సురేష్ ఉపాధి కోసం దుబాయ్ బాట పట్టారు. ఆయన సహకారంతో సుమన్ డిగ్రీ, పీజీ, పోటీ పరీక్షలకు సన్నద్ధమై అన్నీ విజయవంతంగా పూర్తి చేశారు.

● "మన కష్టాలను మనమే ఎదుర్కోవాలి.. ఉన్నచోటు నుంచి ఉన్నత స్థానానికి వెళ్లాలంటే ప్రణాళిక, పట్టుదల చాలా కీలకం. మన ఇబ్బందులపై ఇతరులు తాత్కాలికంగా సానుభూతి చూపించొచ్చు. కానీ మనతో కలిసి నడిచే వారుండరు. ఆత్మవిశ్వాసంతో విజయం వైపు అడుగులు వేయడమే నా విజయానికి కారణమని ఆ యువ గెజిటెడ్ అధికారి సుమన్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు"..

పీజీలు 'రెండు' బంగారు పతకాలు

సైకాలజీలో డిగ్రీ పూర్తి చేసి పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ ఆంత్రోపాలజీ, లైబ్రరీ, ఇన్‌ఫర్మేషన్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశారు. చక్కని ప్రతిభతో రెండింటిలో బంగారు పతకాలు సాధించారు. యూజీసీ నెట్, తెలంగాణ సెట్ అర్హత సాధించారు.

ఇవీ సాధించిన ఉద్యోగాలు

✦ గురుకులాల్లో పాఠశాల, మాధ్యమిక, డిగ్రీ కళాశాల (2023 సంవత్సరంలో వేర్వేరు నోటిఫికేషన్‌ల ద్వారా పరీక్షలు రాసి) లైబ్రేరియన్‌గా ఏడాది కాలంలోనే మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

✦ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ లైబ్రేరియన్ ఉద్యోగానికి 2022 నోటిఫికేషన్‌లో పరీక్ష రాసి ఆ కొలువు సాధించారు. ప్రస్తుతం బెంగళూరు రీజియన్ బగల్‌కోట్ కేంద్రీయ విద్యాలయంలో గ్రంథాలయాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

✦ తాజాగా విడుదలైన పాలిటెక్నిక్ కళాశాల లైబ్రేరియన్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో 8వ ర్యాంకు, బాసర జోన్‌లో మొదటి ర్యాంకుతో ఏడాది కాలంలోనే తన అయిదో ఉద్యోగాన్ని సాధించారు. సొంతూరుకు చేరువలోనే నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సుమన్‌కు పోస్టింగ్ లభించింది. ఈ కొలువుకు గెజిటెడ్ అధికారి హోదా ఉండడంతో కేంద్రీయ విద్యాలయం ఉద్యోగాన్ని వదులుకున్నారు.

పశువుల కాపరి కుమారుడు అయ్యాడు ఉపాధ్యాయుడు..



జన్నారం, న్యూస్‌టుడే: కడు పేదరికం. నాన్న పశువుల కాపరిగా పనిచేస్తే వస్తే కూలీ డబ్బులే వారికి కడుపు నింపేది. కష్టపడి చదివి నాన్న కష్టాల్లో పాలు పంచుకోవాలని కలలు కన్నాడు. అయితే తానొకటి తలిస్తే దైవం మరోలా చేసింది. ఇంటర్ చదివే సమయంలో తండ్రి మృతి చెందడంతో చదువు ఆగిపోయే పరిస్థితి నెలకొంది. ఎన్నో ఇక్కట్లు అధిగమించి ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ కొలువు సాధించారు.

జన్నారం మండలం మొర్రిగూడ ఎస్సీ కాలనీకి చెందిన సంతపురి చిన్నులు-మల్లవ్వ దంపతుల కుమారుడు సంతపురి అశోక్ జీవశాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మంచిర్యాల జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 21వ ర్యాంకు సాధించగా ఎస్సీ విభాగంలో మొదటి ర్యాంకు సొంతం చేసుకున్నాడు. చిన్నతనం నుంచే చదువుపై ఆసక్తి ఉన్న అశోక్ ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాడు. ప్రాథమిక విద్య మొర్రిగూడ ప్రభుత్వ పాఠశాలలో, ఆరు నుంచి ఇంటర్ వరకు ఆసిఫాబాద్‌లోని సాంఘిక సంక్షేమ వసతి గృహం, డిగ్రీ నిర్మల్ ప్రభుత్వ కళాశాలలో, పీజీ తెలంగాణ విశ్వవిద్యాలయంలో పూర్తి చేసిన అశోక్ బీఈడీ నిజామాబాద్‌లో చదివారు. ఇంటర్‌లో తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిపోయింది. చదువు పూర్తి కాగానే 2021లో వెన్నెలతో వివాహమైంది. అన్నయ్యలు శ్రీనివాస్, శంకర్, భార్య వెన్నెల, ఇద్దరు అక్కయ్యలు, చిన్ననాటి మిత్రుల సహకారంతోనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి కొలువు సాధించానని, పేద విద్యార్థుల చదువుకు తనవంతు సహకారం అందిస్తానని అశోక్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. కటిక పేదరికాన్ని జయించి కొలువు సాధించిన అశోక్‌ను కాలనీ వాసులు అభినందించారు.

పులి సంచారం.. భయం భయం!



కెరమెరి, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రాంతాల్లో పులి సంచారం స్థానికులను కలవరపెడుతోంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో మండలంలోని పరందోలి, కరంజివాడ, లక్మాపూర్, ఇందాపూర్ గ్రామాల శివారు అటవీ ప్రాంతాల్లో పులి సంచరించిన విషయం విదితమే. కాగా ఈ వారంలో మండలంలోని కెరమెరి ఘాట్ అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఎలాంటి ఉచ్చులు, విద్యుత్తు తీగలు అమర్చవద్దని, అటవీ సమీప గ్రామాలవాసులు అప్రమత్తంగా ఉండాలని జోడేఘాట్ ఎఫ్ఆర్ఓ జ్ఞానేశ్వర్ సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారిణి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. సబ్-జూనియర్స్ విభాగంలో కీర్తి అగర్వాల్ 15 నుంచి హరియాణాలో నిర్వహించే పోటీలకు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఖేలో ఇండియా కేంద్రం శిక్షకుడు రాజేష్ శిక్షణలో ప్రతిభ చాటుతున్న ఆమెను జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి రాజ్‌వీర్ అభినందించారు.



క్రీడాకారిణి కీర్తి అగర్వాల్‌తో శిక్షకుడు రాజేష్



బాసరలో శోభాయాత్ర

బాసరలో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు అమ్మవారు సరస్వతి రూపంలో దర్శనమిచ్చారు. ఉత్సవాలు ముగియడంతో అమ్మవారికి అభిషేకం చేసిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాసర గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి అశ్వరథంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రలో గ్రామంలోని మహిళలు, యువతులు నృత్యాలతో స్వాగతం పలికారు.



తనికెళ్ల భరణి మనవడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న వేదపండితులు



సరస్వతి అమ్మవారి సన్నిధిలో నిర్మాత దిల్‌రాజు దంపతులు

దర్శించుకున్న ప్రముఖులు

జ్ఞాన సరస్వతిని ఆదివారం సినీనటుడు తనికెళ్ల భరణి దర్శించుకున్నారు. తన మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్మాత దిల్‌రాజు బాసరలోని వేదభారతి పాఠశాలను సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వచ్చి సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం పక్షాన వారిని సన్మానించిన వేదపండితులు తీర్థప్రసాదాలను అందజేశారు.

తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా..

త్వరలో ఆదిలాబాద్ మీదుగా మూడు కొత్త రైళ్లు



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం :

ఉమ్మడి ఆదిలాబాద్‌లోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా మూడు కొత్త రైళ్లు పట్టాలెక్కనున్నాయి. ప్రజలు ఎదురుచూస్తున్న ఈ రైళ్ల కూతలు త్వరలో వినిపించనున్నాయి. కాజీపేట నుంచి మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే ఈ రైళ్లు వయా ఆదిలాబాద్ మీదుగా రాకపోకలు సాగించనుండటంతో ఇరుప్రాంతాలకు ప్రయోజనం చేకూరనుంది. గతంలోనే కాజీపేట-ముంబయికి ఉన్న తాడోబా ఎక్స్‌ప్రెస్ రైలు తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా వారానికొకసారి నడిచేది. కరోనా సమయంలో రద్దుచేశారు. తాజాగా ఈ మార్గంలో రైలు మళ్లీ పునరుద్ధరించనున్నారు. మూడు ప్రత్యేక వారాంతపు రైళ్లకు సంబంధించి సమయసారిణి జారీ కావడం శుభపరిణామం. వీటి ప్రారంభానికి సంబంధించి ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది.

✦ కాజీపేట-పుణె ఎక్స్‌ప్రెస్ రైలు వయా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్ మీదుగా ఉత్తరంవైపున ఉన్న మహారాష్ట్రలోకి ప్రవేశించి బల్లార్ష, మాంజిరి నుంచి తిరిగి పశ్చిమదిశలో తెలంగాణలోకి వచ్చి ఆదిలాబాద్‌కు చేరుకుంటుంది. ఆదిలాబాద్ మీదుగానే మళ్లీ పశ్చిమ ప్రాంతంలోని మహారాష్ట్రవైపున మన్మాడ్ చేరుకొని అక్కడి నుంచి నాందేడ్, ఔరంగాబాద్ మీదుగా పుణె వైపు మళ్లుతుంది. వారానికొకసారి నడిచే ఈ రైలు ప్రతి బుధవారం ఉదయం 6.35 గంటలకు పుణె నుంచి ప్రారంభమై గురువారం ఉదయం 6.30 గంటలకు కాజీపేట చేరుకుంటుంది. మధ్యలో ఆదిలాబాద్‌లో రాత్రి 11.45 గంటలకు అందుబాటులో ఉంటుంది. ప్రతి గురువారం ఉదయం 8 గంటలకు కాజీపేట నుంచి బయలుదేరి పుణె వెళుతూ ఆదిలాబాద్‌లో మధ్యాహ్నం 3.15 గంటలకు అందుబాటులో ఉంటుంది. పుణెకు శుక్రవారం రాత్రి 9.45 గంటలకు చేరుకుంటుంది.

✦ కాజీపేట-దాదర్ ప్రత్యేక రైలు(స్పెషల్ రైలు) సైతం మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ మీదుగా బల్లార్ష, వని, లింగ్టి నుంచి ఆదిలాబాద్‌కు మళ్లుతుంది. తిరిగి మహారాష్ట్రలోని కిన్వట్, నాందేడ్, ఔరంగాబాద్, పుణె మీదుగా దాదర్ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. కాజీపేట నుంచి శనివారం ఉదయం 11.30 గంటలకు బయలుదేరే ఈ రైలు మంచిర్యాలకు మధ్యాహ్నం 12.59 గంటలకు, బెల్లంపల్లిలో మధ్యాహ్నం 1.19 గంటలకు, కాగజ్‌నగర్‌కు 2 గంటలకు, ఆదిలాబాద్‌కు రాత్రి 8.30 గంటలకు చేరి ప్రయాణికులను ఎక్కించుకుంటుంది. దాదర్‌కు ఆదివారం మధ్యాహ్నం 1.25 గంటలకు చేరుతుంది. అదే దాదర్ రైల్వేస్టేషన్ నుంచి ఆదివారం మధ్యాహ్నం 3.25 గంటలకు కాజీపేటకు బయలుదేరే రైలు ఆదిలాబాద్‌లో సోమవారం ఉదయం 11.10 గంటలకు, కాగజ్‌నగర్ స్టేషన్‌లో సాయంత్రం 6.45 గంటలకు, బెల్లంపల్లిలో రాత్రి 7.05 గంటలకు, మంచిర్యాలలో రాత్రి 7.19 గంటలకు చేరి అక్కడి నుంచి సోమవారం రాత్రి 9.30 గంటలకు కాజీపేట గమ్యానికి చేరుతుంది.

✦ కరీంనగర్-పుణె వారానికొకసారి స్పెషల్‌రైలు నడపనున్నారు. ప్రతి బుధవారం కరీంనగర్ నుంచి బయలుదేరి వయా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్, బల్లార్ష, మాంజిరి, ఆదిలాబాద్ మీదుగా పుణెకు వెళుతుంది. కరీంనగర్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరే ఈ రైలు మంచిర్యాలలో ఉదయం 7.16 గంటలకు, కాగజ్‌నగర్‌లో 8.50 గంటలకు, ఆదిలాబాద్‌కు మధ్యాహ్నం 1.45 గంటలకు రైలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. పుణెకు గురువారం ఉదయం 9.45 గంటలకు చేరుకుంటుంది. అదే పుణె రైల్వేస్టేషన్ నుంచి కరీంనగర్‌కు వచ్చే రైలు అక్కడ సోమవారం రాత్రి 10.45 గంటలకు బయలుదేరే రైలు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆదిలాబాద్‌లో, సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రాత్రి 10.48 గంటలకు, మంచిర్యాలకు రాత్రి 11.36 గంటలకు చేరుకుంటుంది.

రూ.54.70 కోట్ల మద్యం తాగేశారు

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఈ ఏడాది దసరా సందర్భంగా పక్షం రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రూ.54.70 కోట్ల మద్యాన్ని మద్యం ప్రియులు తాగేశారు. గత సంవత్సరం కంటే ఇది రూ.9.15 కోట్లు అధికం. గతేడాది దసరా సందర్భంగా 12 రోజుల్లో రూ.45,54,55,135 మద్యం విక్రయాలు జరగగా ఈ ఏడాది రూ.54,69,95,145 మద్యం అమ్ముడైంది.

ఉమ్మడి జిల్లాలో దసరా సందర్భంగా పక్షం రోజుల్లో జరిగిన అమ్మకాలు జిల్లాల వారీగా (రూ.లలో)

జిల్లా	గతేడాది	ఈ ఏడాది విక్రయాలు
ఆదిలాబాద్	8,23,70,060	11,10,90,368
నిర్మల్	11,03,53,360	12,06,32,027
కుమురంభీం	5,75,21,925	7,62,75,947
మంచిర్యాల	20,52,09,790	23,89,96,803
మొత్తం	**45,54,55,135**	**54,69,95,145**

చేయూతతో.. చేనేతల్లో ఆనందం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే:

రెక్కల కష్టాన్ని నమ్ముకుని కులవృత్తితోనే ఏళ్ల తరబడి చేనేతలు జీవనం సాగిస్తున్నారు. చేసిన పనికి గిట్టుబాటు ధర లభించనప్పటికీ, మరో పని చేయలేక అదే వృత్తిలో కొనసాగుతున్నారు. సహకార సంఘాలు వారికి కొంత మేరకు తోడ్పాటు అందిస్తున్నాయి. ఇటీవల 'చేనేతకు చేయూత' పథకంలో ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో.. చేనేత కార్మికుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ పథకాన్ని ఇలాగే కొనసాగిస్తే తమ జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కోసిని సొసైటీలో వస్త్రం నేస్తున్న చేనేత కార్మికురాలు


ఉమ్మడి జిల్లాలో రెండు చోట్ల చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు, కుమురంభీం జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం కోసినిలో కొనసాగుతున్నాయి. కోసినిలోని సహకార సంఘం అయిదు దశాబ్దాల కిందట 80 మంది కార్మికులతో ప్రారంభమైంది. ప్రభుత్వ చేయూత కొరవడటంతో ప్రస్తుతం 30 మందికి తగ్గిపోయింది. చెన్నూరులో 1949లో సహకార సంఘం ఏర్పాటు కాగా 40 మంది సభ్యులతో ప్రారంభమైన సంఘం దినదినాభివృద్ధి చెందుతూ 500 మంది కార్మికులతో విజయవంతంగా కొనసాగింది. చెన్నూరుతోపాటు కోటపల్లి, జైపూర్, వేమనపల్లి, నెన్నెల మండలాల కార్మికులు సంఘంలో చేరి వస్త్రాలు నేశారు. అనంతర కాలంలో ఈ రెండింటికీ ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడం, నూలు వస్త్రాల దిగుమతిలో ఇబ్బందులు, తదితర కారణాలతో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు కార్మికులకు చేతినిండా ఉపాధి కల్పించి అనంతరం ఏర్పడ్డ పరిస్థితులతో వస్త్రాలు నేస్తున్న కార్మికులకు కూలీ గిట్టుబాటు కాకపోవడం, అప్పటి ప్రభుత్వాలు సహకారం లేకపోవడంతో.. చాలా మంది పనిమానేశారు.

గడువులోపే..

చేనేతలకు ప్రభుత్వం 'చేనేతకు చేయూత' పథకం ప్రారంభించగా.. కార్మికులు 2021లో చేరి నెల నెలా ఆర్డీ రూపంలో నగదు జమ చేశారు. కార్మికుడు ప్రతి నెలా తన ఖాతాల్లో రూ.500 జమ చేస్తే ప్రభుత్వం మరో రూ.వెయ్యి వారి ఖాతాల్లో జమ చేస్తుంది. పథకం 2021 సెప్టెంబర్‌లో ప్రారంభమై 2024 ఆగస్టుతో ముగిసింది. మూడు సంవత్సరాల పాటు కార్మికులు ఆర్డీ రూపంలో జమ చేసిన సొమ్ము ప్రభుత్వం ఇవ్వాల్సిన రెండింతల సొమ్ము కార్మికుల ఖాతాల్లో ఇటీవలే జమ కావడం వారిలో కొంత ఊరటనిచ్చింది. ఈ పథకాన్ని కొనసాగిస్తే తమకు కొండంత అండగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పథకాన్ని కొనసాగించాలి

-నల్ల కనకయ్య, చేనేత సహకార సంఘం కార్యదర్శి, కాగజ్‌నగర్



చేనేతకు చేయూత పథకంలో సొసైటీ కార్మికుల ప్రతి నెలా మూడు సంవత్సరాలపాటు నగదు జమ చేశారు. ఇటీవలే ప్రభుత్వ వాటా కలిపి నిధులు విడుదల చేయడం సంతోషాన్నిచ్చింది. తిరిగి ఈ పథకాన్ని కొనసాగిస్తే కార్మికులకు ప్రోత్సాహాన్ని ఇచ్చినట్లవుతుంది. సంఘాల్లో సభ్యుల సంఖ్య పెరిగి అభివృద్ధి సాధిస్తాయి. కార్మికులకు అమలు చేస్తున్న నేతబీమా పథకం 75 సంవత్సరాల వయసుకు పెంచాలి. చాలా మంది సంఘంలో వృద్ధులు ఉన్నందున బీమా పథకంపై ప్రభుత్వం పునరాలోచించాలి. 2020లో తీసుకున్న ముద్ర రుణాలు మూడేళ్ల పాటు వడ్డీతో కలిపి చెల్లించారు. రుణం మొత్తాన్ని మాఫీ చేయాలి.

తెలంగాణ అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా పి.రాజేశ

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : చాంద(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్న పి.రాజేశ్ తెలంగాణ అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా ఎంపికయ్యారు. భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఈ నెల 17 నుంచి 19 వరకు ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే 35వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆయన తెలంగాణ జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తారు. జాతీయస్థాయి క్రీడాకారుడిగా రాణించి ఎన్నో పతకాలు సాధించిన ఆయన జిల్లా జట్టుకు తొమ్మిదిసార్లు రాష్ట్రస్థాయిలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రావడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన ప్రతిభను గుర్తించి తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం తెలంగాణ అథ్లెటిక్స్ జట్టుకు మేనేజర్‌గా నియమించింది. ఈ ఘనత సాధించినందుకు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, జిల్లా క్రీడాధికారులు వేంకటేశ్వర్లు, పార్థసారథి ఆయనకు అభినందనలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా...
నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

? పట్టణంలోని శాంతినగర్ కాలనీలో పైపులైన్ లీకేజీలతో రహదారిపై నీరు వృథాగా పోతుంది. రోడ్డుపై నడవడానికి ఇబ్బందిగా మారింది.
-వేణు, శాంతినగర్ కాలనీ

✔ లీకేజీలను పరిశీలించి మరమ్మతులు చేపడతాం -జావిద్, మున్సిపల్ వాటర్‌మెన్
– ఖానాపూర్, న్యూస్‌టుడే

చెరువులో మునిగి ఒకరి మృతి


వాగ్మారే సాహెబ్‌రావు

తానూరు(భైంసా): మండల కేంద్రానికి చెందిన వాగ్మారే సాహెబ్‌రావు(40) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. ఎస్సై డి.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పనులు చేసుకునే సాహెబ్‌రావు శనివారం ఉదయం కుటుంబీకులతో కలిసి గ్రామ శివారులోని డాంగెపెల్లి భీమన్న ఆలయానికి వెళ్లారు. మధ్యాహ్నం బహిర్భూమికి చెరువు గట్టువైపు వెళ్లిన ఆయన ఎంతకీ తిరిగి రాకపోయేసరికి కుటుంబీకులు వెళ్లి చూడగా నీటిలో పడి ఉన్నారు. స్థానికుల సాయంతో బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోటవేటర్‌లో పడి ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

సారంగాపూర్: ట్రాక్టర్ రోటవేటర్‌లో పడి శనివారం రాత్రి మండలంలోని ఆలూర్ గ్రామానికి చెందిన దేశెట్టి రమేష్(42) మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. రమేష్ తన సొంత ట్రాక్టర్ తీసుకొని వ్యవసాయ క్షేత్రంలో రోటవేటర్ చేస్తున్నారు. ప్రమాదవశాత్తు కిందపడి రోటవేటర్‌లో ఇరుక్కుపోయారు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో రమేష్ భార్య శ్రీలత తమ పంటక్షేత్రం పక్కనే ఉన్న వ్యక్తికి ఫోన్‌చేశారు. ఆయన వెళ్లి చూడగా రమేష్ రోటవేటర్‌లో ఇరుక్కుని మృతి చెంది ఉన్నారు. ఎస్సై సల్ల శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


రమేష్

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ బస్టాండ్ సమీపంలో శనివారం సాయత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్ మండల అనంతపేట్‌కు చెందిన పోలీసు బొర్రన్న(54) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బొర్రన్న తన ద్విచక్రవాహనంపై దిలావర్‌పూర్‌వైపు వస్తుండగా ఎదురుగా గుర్తుతెలియని వాహనం బలంగా ఢీ కొనడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. 108లో నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నామని ఏఎస్సై భీంరావు తెలిపారు.

అనుమానాస్పదంగా క్లీనర్...

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని బీర్నంది తండా వాసి ఉపాధి కోసం వెళ్లి మహారాష్ట్ర వెళ్లి శుక్రవారం అక్కడే అనుమానాస్పదంగా మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భుక్య శేఖర్(24) కొద్ది రోజుల క్రితం ఉపాధి కోసం ఓ లారీపై క్లీనర్ పనిమీద మహారాష్ట్ర వెళ్లారు. ప్రయాణిస్తున్న లారీ పైనుంచి దూకడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. శేఖర్ మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శేఖర్ మరణం తీరుపై గ్రామస్థులు పలు విధాలా చర్చించుకుంటున్నారు.


భుక్య శేఖర్

స్తంభాన్ని ఢీకొని ఖానాపూర్ వాసి దుర్మరణం

ఖానాపూర్, హైదరాబాద్(ఆదిభట్ల), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు అదుపుతప్పి రోడ్డు పక్కన కాలువలో పడడంతో ఇద్దరు మృతి చెంది, ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన డానీసింగ్(40), నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణం శాంతినగర్‌కాలనీకి చెందిన ఏసీ టెక్నీషియన్ పెరుమాళ్ల హరీష్‌గౌడ్(28), పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రకాశ్.. ఆదిభట్ల టీసీఎస్ ఎదురుగా ఉన్న ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. వేర్వేరు పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ ముగ్గురూ ద్విచక్ర వాహనంపై బొంగులూరు వైపు ఆదివారం మధ్యాహ్నం వెళ్తున్నారు. శ్రీరామధర్మ కాంటా సమీపంలోని సర్వీస్ రోడ్డులో స్తంభాన్ని ఢీకొన్నారు. దీంతో డానీ, హరీష్‌గౌడ్ అక్కడే మృతి చెందారు. వాహనం నడుపుతున్న ప్రకాశ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. హరీష్‌గౌడ్ భజరంగ్‌దళ్ నిర్మల్ జిల్లా గోరక్షక్‌గా పని చేస్తున్నారు. మృతునికి భార్య, ఓ బాబు ఉన్నారు.


హరీష్ గౌడ్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన చెందిన ఘటన మండలంలోని బాబుల్‌గాంలో ఆదివారం చోటుచేసుకుంది. భైంసా గ్రామీణ ఎస్సై జి.శ్రీనివాస్‌యాదవ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కదం అంబదాస్ (35) కూలీ పని చేస్తుంటారు. కుటుంబపోషణ భారం కావడం, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దీంతో ఏడాదిగా మద్యానికి బానిసయ్యారు. పది రోజులుగా అధికంగా మద్యం తాగారు. తెల్లవారుజామునే ఇంటి నుంచి బయటకి వెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని విగతా జీవిగా కనిపించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి ఓ కుమారుడు ఉన్నాడు.


కదం అంబదాస్

బతుకమ్మ నిమజ్జనం వేడుకల్లో విషాదం

ద్విచక్రవాహనం ఢీకొని పలువురికి గాయాలు

సారంగాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని నిర్మల్-స్వర్ణ రహదారి సాయినగర్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సారంగాపూర్‌కు చెందిన ఎనుగంటి రాంచందర్‌గౌడ్(40), సాయినగర్‌కు చెందిన రాఠోడ్ రోహిదాస్(44) తీవ్రంగా గాయపడ్డారు. ఇదే గ్రామానికి చెందిన జాదవ్ అర్చన(20), ఆడె నితుష(17), ఆడె సునీత(20) స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌కు చెందిన మహిళలు, యువతులు గ్రామ సమీపంలోని రహదారిపై కల్వర్టు వద్ద బతుకమ్మ నిమజ్జనం చేస్తున్నారు. ఇదే సమయంలో నిర్మల్ నుంచి సారంగాపూర్‌కు వెళ్తున్న రాంచందర్‌గౌడ్ ద్విచక్ర వాహనం అదుపుతప్పి వారిని ఢీకొట్టారు. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాంచందర్‌గౌడ్ పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఆయనకు శస్త్రచికిత్స చేయాలని ఇందుకు పెద్దమొత్తంలో డబ్బులు అవసరమవుతాయని వైద్యులు పేర్కొన్నట్లు రాంచందర్‌గౌడ్ కుటుంబీకులు చెప్పారు. తమకు అంత స్థోమత లేదని, దాతలు ఆదుకోవాలని కోరారు. కాగా, రోహిదాస్‌కు నాలుగు చోట్ల కాలు, చేయి విరిగాయి. అతను సాయినగర్ కారోబార్‌గా పనిచేస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సారంగాపూర్ ఎస్సై సల్ల శ్రీకాంత్ తెలిపారు.

నల్ల పోచమ్మ ఆలయంలో చోరీ

ఖానాపూర్: పట్టణంలోని రెంకొని వాగు దగ్గర ఉన్న నల్ల పోచమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శనివారం ఉదయం ఆలయ అర్చకుడు వచ్చిన సమయంలో తాళం పగులగొట్టి ఉంది. రెండు తులాల వెండి విగ్రహాలు, ఇత్తడి నవగ్రహాలు, అమ్మవారి చీరెలను ఎత్తుకెళ్లారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత

ఖానాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శ్రీరాంనగర్ కాలనీకి చెందిన గుమ్ముల అశోక్ శనివారం రెండు తులాల బంగారు గొలుసు పోగొట్టుకున్నారు. హిందూ ఉత్సవ సమితి నాయకులు పోగొట్టుకున్న ఆ గొలుసును గుర్తించి భద్రపరిచారు. శ్రీరాంనగర్‌కు చెందిన దివాకర్ సామాజిక మాధ్యమాల్లో గొలుసు పోయిందని పోస్టులు పెట్టారు. ఈ సమాచారం అందడంతో ఉత్సవ సమితి నాయకులు సురేష్, శెట్టి శ్యామ్, లక్ష్మణ్, కృష్ణ, శ్రీరాంనగర్ యూత్ అధ్యక్షుడు సాయి ఆధ్వర్యంలో బంగారు గొలుసును బాధితుడు అశోక్‌కు అందజేశారు.


నిర్మల్ : దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు


లోకేశ్వరం: రాజురాలో ..


మామడలో దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్రలో గ్రామస్థులు


దస్తురాబాద్: గొడిసిర్యాలలో ఏకరూప దుస్తులతో యువతులు


నిర్మల్ : మంగళహారతులతో..


నిర్మల్ : నిమజ్జన శోభాయాత్రలో సంప్రదాయ దుస్తుల్లో..


కడెం: దుర్గామాత విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు


నిర్మల్ అర్బన్ : మంజులాపూర్‌లో అమ్మవారి ప్రతిమ శోభాయాత్ర

నేత్రపర్వంగా అమ్మవారి శోభాయాత్ర

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా శనివారం దుర్గాదేవి నిమజ్జనోత్సవాలు, దసరా పండగను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలో అమ్మవారి విగ్రహాల శోభాయాత్ర నేత్రపర్వంగా జరిగింది. ఓ వైపు బంగల్‌పేట్ మహాలక్ష్మీ అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుతీరగా మరోవైపు దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్రతో పట్టణమంతా పండగ వాతావరణం కనిపించింది. చిన్నారులు, యువత నృత్యాలు, మహిళల కోలాటాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళలు, యువతులు, బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి చేసిన నృత్యాలు అలరించాయి. వినాయక్‌సాగర్ (బంగల్‌పేట్ చెరువు)లో దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనం తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ముథోల్: కారేగాం ఎల్లమ్మదేవికి సమర్పించే పట్టువస్త్రాలతో ఎమ్మెల్యే రామారావు పటేల్

ముథోల్: మండలంలోని కారేగాం ఎల్లమ్మ దేవికి ఎమ్మెల్యే రామారావుపటేల్ పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వెళ్లేందుకు అవసరమైన కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేశారు


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఖానాపూర్: చెడుపై మంచి విజయం సాధించడమే విజయదశమి అని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. ఖానాపూర్‌లో శనివారం నిర్వహించిన విజయదశమి వేడుకల్లో ఆయన మాట్లాడారు.


దుర్గాదేవి ప్రతిమతో మహిళ


నిర్మల్ : నృత్యం చేస్తున్న భవానిమాత భక్తులు


మంజులాపూర్‌లో శోభాయాత్రకు ముందు అమ్మవారి మండపంలో భక్తులు


నిర్మల్ : బంగల్‌పేట్ (వినాయకసాగర్) చెరువులో దుర్గామాత ప్రతిమ నిమజ్జనం


ముథోల్: శోభాయాత్రకు ప్రత్యేక వాహనంలో తరలుతున్న దుర్గామాత


నృత్యం చేస్తున్న యువతులు


నిర్మల్‌లోని బంగల్‌పేట్ మహాలక్ష్మి అమ్మవారి పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి ఐకేరెడ్డి


దుర్గాదేవి ప్రతిమతో ఖానాపూర్ పుర ఛైర్మన్ సత్యం


ముథోల్: నృత్యాలు చేస్తున్న కరీంనగర్ కళాకారులు


లక్ష్మణచాందా: వడ్యాల్‌లో దుర్గామాతల నిమజ్జనం ఊరేగింపులో గ్రామస్థులు


ఖానాపూర్ : జెండాగల్లి వేడుకల్లో పాల్గొన్న భారాస నేత జాన్సన్‌నాయక్


సోన్: కడ్తాల్‌లో


భైంసా: దసరా సందర్భంగా గట్టు మైసమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పటేల్


లక్ష్మణచాందా: వడ్యాల్‌లో..


నిర్మల్: గండిరామన్న క్షేత్రంలో శమి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా విజయదశమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా శనివారం విజయదశమి(దసరా) పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జమ్మిచెట్టు వద్ద పూజలు చేసి జమ్మి ఆకులు పంచుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలుచోట్ల రావణ దహన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో జనాలు హాజరయ్యారు. పోలీసు స్టేషన్లల్లో ఆయుధ పూజలు నిర్వహించారు. పరిశ్రమల్లో యజమానులు యంత్రాలను పూజించారు.

- న్యూస్‌టుడే బృందం


ఖానాపూర్ : గోసంపల్లె గ్రామంలో..


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998-99 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు బోధించిన గురువులను సన్మానించారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

పురస్కారాల అందజేత

నిర్మల్ అర్బన్: ఇటీవల ఉద్యోగాలు, ఉన్నత విద్యలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారినిఆదివారం పట్టణంలోని విజయనగర్ కాలనీ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. గుమిడ్యాల దత్తాద్రి, కుర్ర నరేశ్, సట్ల వెంకటి, అధ్యక్షుడు ఆసం శంకర్, ప్రధాన కార్యదర్శి తలకొక్కుల సాయన్న, కోశాధికారి రేగుంట నర్సయ్య పాల్గొన్నారు.

కుభీరులో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

కుభీరు: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీనీలకంఠ పత్తికొనుగోలు కేంద్రంలో శనివారం పత్తి కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయి. కొనుగోలు కేంద్రం యజమానులు రెడ్డిశెట్టి సంతోష్, ఆనంద్ తూకం యంత్రాలకు పూజలు చేసి కొనుగోళ్లను ప్రారంభించారు. క్వింటాలు పత్తికి రూ.6850 చెల్లించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ఖానాపూర్ గ్రామీణం: విద్యుదాఘాతంతో గర్భం దాల్చిన ఓ గేదె మృతి చెందిన ఘటన మండలంలోని గోసంపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అమ్గోత్ తానాజీ గేదెలను కాస్తూ సంపాదించిన డబ్బుతో ఇటీవల ఓ గేదెను కొన్నాడు. శనివారం గ్రామంలోని మందోట వద్ద ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తాకి గేదె మృతి చెందింది. రూ.50 వేలు విలువ చేసే గేదెకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. గ్రామస్థులు భుక్యా సురేందర్, అమంద రాజారాం, చందు, బానావత్ కుమార్, బోడికె సంతోష్, చేనె శ్రావణ్, బాలయ్య ఉన్నారు.

ముగిసిన పీపీఎల్-3 క్రికెట్ పోటీలు

పెంబి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నిల్‌రెడ్డి పేర్కొన్నారు. వారం రోజులపాటు కొనసాగిన పీపీఎల్-3 క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన రెయిన్‌బో వారియర్స్ జట్టుకు రూ.20 వేలు, రన్నరప్‌గా నిలిచిన సూపర్ స్ట్రైకర్ పెంబి జట్టుకు రూ.10 వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. నాయకులు శంకర్, నిర్వాహకులు పెండల నరేష్, మతీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని భావితరాలకు చాటిచెప్పాలి

కుంటాల: సంస్కృతి, సంప్రదాయాలు, పండగ విశిష్టతలను భావితరాలకు తెలియజెప్పాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. దసరా సందర్భంగా అంబకంటితండాలో శనివారం తీజ్ ఉత్సవాలు నిర్వహించారు. తీజ్ బుట్టలను ఎత్తుకుని సంబరాల్లో పాల్గొన్నారు. లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం, భైంసా ఏఎంసీ మాజీ అధ్యక్షుడు రాజేష్‌బాబు, నాయకులు వెంగళ్‌రావు, సుధాకర్, గోకుల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు ఆచరణీయం


భైంసా: పంచశీల జెండా ఆవిష్కరించి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే పటేల్, నాయకులు

భైంసా, న్యూస్‌టుడే: విజయ దశమి పురస్కరించుకుని దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం భైంసాలో దమ్మచక్ర పరివర్తన దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ప్రార్థనలు చేశారు. ఎస్సీ ఫర్ ఎస్సీ రైట్స్ సంస్థ వ్యవస్థాపకుడు సాయిలు మైసేకర్, కాంగ్రెస్ నాయకులు ఓంప్రకాశ్ లడ్డా, శంకర్ చంద్రే, భీంరావు డోంగ్రే, యశ్వంత్ బన్సోడే, భాజపా పట్టణాధ్యక్షుడు మల్లేశ్, ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్, తూమొల్ల దత్తాత్రి, అంబేడ్కర్ యువజన, భారతీయ బౌద్ధమహాసభ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భైంసా గ్రామీణం: మండలంలోని ఆయా గ్రామాల్లో దమ్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. బుద్ధుడు, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

కుంటాల: బుద్ధుడు సూచించిన బోధనలు ఆచరణీయమని ఏవైఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్ అన్నారు. దమ్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వెంకూర్‌లో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. పంచశీల జెండాను ఆవిష్కరించారు. నాయకులు అశోక్, సుధాకర్, గణేష్, పోతన్న, నారాయణ, గజ్జారాం, రవిప్రసాద్, గజానంద్, గంగాధర్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్: పట్టణంలోని టీఎన్‌జీవోస్ భవనంలో మాదిగల అంబేడ్కర్ సంఘం (ఎంఏఎస్) ఆధ్వర్యంలో దమ్మ చక్రపరివర్తన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. బుద్ధుడు, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. నాయకులు మారపాక భీమయ్య, నిగులపు లింగన్న, రమేష్, సట్టి సాయన్న, కొలగని రాజు, అడ్డిగ లక్ష్మణ్, నరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముథోల్: ముథోల్‌లో శనివారం దమ్మ చక్ర పరివర్తన దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. యువకులు నృత్యాలు చేస్తూ, మహిళలు కోలాటల మధ్య శోభాయాత్ర కొనసాగింది. భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ ఆధ్వర్యంలో భైంసా గ్రామీణ సీఐ నైలు, ఎస్సై సాయికిరణ్ బందోబస్తు నిర్వహించారు.

దసరా లడ్డూ కోసం వేలం పాటలో పోటీ


లడ్డూను అందుకుంటున్న మనోహర్ కుటుంబ సభ్యులు

మామడ, న్యూస్‌టుడే: మండలంలోని పొన్కల్ శ్రీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో ఏటా దసరా పండగకు లడ్డూ వేలం నిర్వహిస్తారు. నవరాత్రుల్లో పూజలందుకున్న ఆ లడ్డూను దక్కించుకునేందుకు గ్రామస్థులు పోటీ పడుతుంటారు. ఈ సారి స్థానికుడు పరికిపండ్ల మనోహర్ రూ.60 వేలకు వేలంలో ఆ లడ్డూను దక్కించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు


కుంటాలలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు, చిన్నారులు

కుంటాల, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో మహిళలు, చిన్నారులు బతుకమ్మలను తయారు చేశారు. దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో బతుకమ్మలు, ఆటపాటలు, కోలాటాలు, నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఓలాలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించగా ఔత్సాహికులు ఉట్టికొట్టేందుకు పోటీ పడ్డారు.


ఒమన్‌లో బతుకమ్మలతో ప్రవాస భారతీయులు

ఒమన్‌లో...

ఖానాపూర్: ఒమన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో ఒమన్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్ అమాల్ క్లబ్‌లో నిర్వహించిన వేడుకల్లో జిల్లాకు చెందిన మహిళలతో పాటు 2500 మందికిపైగా ప్రవాస భారతీయులు పాల్గొన్నారని ఒమన్ తెలంగాణ సమితి కన్వీనర్ గుండేటి గణేష్, కో కన్వీనర్ నూనె లక్ష్మణ్ తెలిపారు.

సాయిబాబా పుణ్యతిథి

కుంటాల: కల్లూరు శ్రీదత్తవెంకటసాయి ఆలయంలో శనివారం సాయిబాబా పుణ్యతిథి వేడుకలు నిర్వహించారు. భక్తులు 24 గంటలపాటు అఖండ సాయి నామస్మరణ చేశారు. బాబా అలంకరణ, అభిషేకం, హారతి, గౌరి, గణపతి, కలశస్థాపన, అర్చన, ధూని తదితర పూజలు నిర్వహించారు.

ఎల్లమ్మ జాతర

భైంసా గ్రామీణం: మండలంలోని వానల్‌పాడ్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలను వైభవంగా జరిగాయి. అమ్మవారి అలంకరణ, అభిషేకం, అర్చన, తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఖానాపూర్ గ్రామీణం : మండలంలోని సుర్జాపూర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం అర్చకులు చక్రపాణి నరసింహమూర్తి, ఆచార్య కోటపల్లి అనీష్, నితీష్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం కల్యాణోత్సవం, గురువారం జాతర, రథోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.